క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 11న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడానికి వారి సలహాలు, సూచనలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసీ వరంగల్ -1 డిపో మేనేజర్ పుప్పాల అర్పిత తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు హనుమకొండలోని వరంగల్ -1 డిపో నుంచి డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్లలోని ప్రయాణికులు 99592 26047 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలిపి, సలహాలు, సూచనలు అందించాలని అర్పిత కోరారు.

'డయల్ యువర్ ఎమ్మెల్యే'కు స్పందన



హసన్‌పర్తి: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు నిర్వహిస్తున్న డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి స్పందన లభించింది. 66వ డివిజన్ హసన్‌పర్తిలోని రాంనగర్ వీధిలో మోటార్ చెడిపోయి నీటి కోసం ఇబ్బందులకు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యేకు స్థానికులు ఫోన్ చేశారు. దీంతో ఆయన వెంటనే స్పందించి అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీచేసి మోటారుకు మరమ్మతులు చేయించారు. అలాగే, 45వ డివిజన్ కడిపికొండ రాంపేట చెరువు కట్ట వద్ద చెట్ల కొమ్మలు, పొదల కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు తెలపగా, జేసీబీ సహాయంతో వాటిని తొలగించారు.

నియామకం



న్యూశాయంపేట: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నగరంలోని పైడిపల్లికి చెందిన బొల్లం విజయ్‌కుమార్‌ను నియమించినట్లు వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విజయ్‌కుమార్‌కు నియామక పత్రం అందజేశారు.

జైలుకు రౌడీషీటర్

న్యూశాయంపేట: పలు కేసుల్లో నిందితుడిగా ఉండి తప్పించుకు తిరుగుతున్న వరంగల్ మిల్స్‌కాలనీ పరిధి కరీమాబాద్‌కు చెందిన రౌడీషీటర్ ఆడెపు అనిల్ అలియాస్ గుమ్మానిని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ గురువారం తెలిపారు. అతడిపై త్వరలో పీడీ యాక్ట్ కూడా నమోదు చేయనున్నట్లు వివరించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్



మడికొండ: ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.72,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు మడికొండ పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కిషన్ ఆదేశాల మేరకు మడికొండ అయోధ్యపురం రోడ్డులోని ఎంఎస్ఆర్ కాలనీలో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడులు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

శానిటేషన్ కిట్ల పంపిణీ

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ తూర్పుకోటలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఆయిల్, సబ్బు, గ్లౌస్, ఆప్రాన్, టవల్‌తో కూడిన శానిటేషన్ కిట్లను 37వ డివిజన్ కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు దూడయ్య, సంగరబోయిన చందర్, అల్లం కేశవరాజు, బోలుగొడ్డు శ్రీనివాస్, ఎలీషా, ప్రతాప్, శానిటరీ జవాన్ అఖిల్, శ్యామ్, దశరథ్ పాల్గొన్నారు.

ముగిసిన సెమినార్

హసన్‌పర్తి: కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన సెమినార్ గురువారం ముగిసింది. 'క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ అండ్ లాజికల్ రీజనింగ్' అనే అంశంపై సెమినార్ జరిగింది. కార్యక్రమంలో ప్రొఫెసర్ వేణుమాధవ్, డాక్టర్ శివశంకర్, డాక్టర్ టి.చంద్రబాబు, డాక్టర్ జి.మంజులతా దేవి, డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

క్లాత్ బ్యాగుల పంపిణీ

విద్యారణ్యపురి: గురు పూర్ణిమను పురస్కరించుకొని శాయంపేట శిశు మందిర్ అధ్యాపకులు, సీనియర్ సిటిజన్లను సన్మానించారు. ఈ సందర్భంగా వారికి క్లాత్ బ్యాగులను ఉచితంగా పంపిణీ చేసినట్లు విద్యావికాస ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

శాకంబరీ అలంకరణలో అమ్మవారు



వేయిస్తంభాల దేవాలయంలో రుద్రేశ్వరస్వామి



పద్మాక్షి కాలనీలో ప్రత్యేక అలంకరణలో పద్మాక్షి అమ్మవారు



శివనగర్ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో..



వరంగల్ ఓసిటీలోని శాకంబరీ అలంకరణలో..



ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి ఆలయంలో..

హన్మకొండ కల్చరల్: ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని వేయిస్తంభాల దేవాలయంలో రుద్రేశ్వరస్వామిని గురువారం శాకంబరేశ్వరుడిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ప్రభాతసేవ, గణపతికి పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం 21 రకాల కూరగాయలు, ఆకుకూరలతో రుద్రేశ్వరి అమ్మవారిని శాకంబరి దేవిగా, రుద్రేశ్వరస్వామిని శాకంబరేశ్వరుడిగా అలంకరించి పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈఓ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.

శాకంబరీ దేవిగా రాజరాజేశ్వరీ దేవి

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవాలయంలో అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో శాకంబరి దేవిగా అలంకరించారు. అర్చకుడు ఘొల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

శాకంబరి అలంకరణలో పద్మాక్షి దేవి

హన్మకొండ అర్బన్: పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షి దేవి.. తీరొక్క పూలు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలతో శాకంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ అర్చకుడు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. అమ్మవారికి అలంకరించిన ఆకుకూరలు, కూరగాయలతో శుక్రవారం ఉదయం అన్నదానం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ సభ్యులు భాస్కర్, సదానందం, రాజ్‌కుమార్, శరత్, హరీష్, హర్ష పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

రామన్నపేట: ఆషాఢ శుద్ధ పౌర్ణమి మహోత్సవంలో భాగంగా నగరంలోని భద్రకాళి రోడ్డులోని సింహాద్రి లక్ష్మీనృసింహస్వామి వారికి నవకలశ స్నపన, విశ్వక్సేన ఆరాధన, కంకణ పూజ, పంచామృత అభిషేకంతో పాటు పండ్ల రసాలు, డ్రైఫ్రూట్స్‌తో గురువారం అభిషేకం చేశారు. అనంతరం పుష్పాలంకరణ, లక్ష తులసి అర్చనలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ రామారావు వివరించారు. ట్రాఫిక్ ఏసీపీ మధుసూదన్ హాజరై స్వామిని దర్శించుకున్నారు.

శాకంబరీ అలంకరణలో లలితాదేవి దర్శనం

ఖిలా వరంగల్: ఆషాఢ మాసం దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ శివనగర్ సీతారామచంద్ర స్వామి దేవాలయంలోని లలితామాత ఆలయంలో లలితాదేవిని సంపూర్ణ శాకంబరీగా గురువారం అలంకరించారు. భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

శాకంబరీ అవతారంలో కనకదుర్గ

వరంగల్ చౌరస్తా: వరంగల్ నర్సంపేట రోడ్డులోని కనకదుర్గ మాత దేవాలయంలో అమ్మవారు గురువారం శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మీసాల ప్రకాష్, ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటేశ్వర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు సింగిరికొండ వెంకటేశ్వర్లు, సర్వార్య సురేష్ కుమార్, పప్పు వేణు, కొప్పుల శేఖర్, వెంకటేశ్వరరావు, జంగం ప్రభాకర్, గూడ శారద, భక్తులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో..

వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వరాలయం ఆకారపు వారి గుడిలో శాకంబరి అలంకరణ వైభవంగా జరిగింది. మహిళా భక్తులు పాల్గొని లలితా పారాయణం చేశారు. ఆలయ ఫౌండర్ ట్రస్ట్ ట్రస్టీ హరీష్ కుమార్ స్వాతి దంపతులు పాల్గొన్నారు.

వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

గురు పౌర్ణమిని పురస్కరించుకొని సాయి మందిరాలను భక్తులు గురువారం సందర్శించారు. ప్రభాతసేవ, కాగడ హారతి, మంగళ స్నానం, సంస్థాన పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్న హారతి నిర్వహించారు. సాయంత్రం ప్రదోషకాల పూజ, సంధ్యా హారతి, అష్టోత్తర శతనామార్చనలు, పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు.

- సాక్షి నెట్‌వర్క్



రుద్రేశ్వరస్వామి సన్నిధిలో గురువులను సన్మానిస్తున్న ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ



43వ డివిజన్ సాయినగర్ కాలనీలో సాయి బాబాకు పూజలు చేస్తున్న పూజారి రామ్మూర్తి



మల్లికాంబ మనోవికాస కేంద్రంలో గురుపౌర్ణమి వేడుకల్లో జ్యోతిరెడ్డి దంపతులు, బాలికలు



హసన్‌పర్తి: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



వరంగల్‌లోని ఎల్లంబజార్‌లో..



మడికొండలో రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న వాల్మీకి సంఘం సభ్యులు

చర్చకు రమ్మంటే ఫోజులిస్తున్నారు

● బీఆర్ఎస్ కార్పొరేటర్లపై కాంగ్రెస్ ధ్వజం



మాట్లాడుతున్న తోట వెంకటేశ్వర్లు

హన్మకొండ చౌరస్తా: పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసింది, ఏడాదిన్నరలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిపై చర్చకు రమ్మంటే మీడియా ముందు ఫోజులిస్తున్నారని బీఆర్ఎస్ కార్పొరేటర్లపై కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. అభివృద్ధిపై చర్చించాల్సిన కౌన్సిల్‌ను వారి చేతగానితనంతో బహిష్కరించారని విమర్శించారు. పార్టీలకు అతీతంగా డివిజన్ల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్న ఘనత ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిది అని వివరించారు. సమావేశంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్, మామిండ్ల రాజు, పోతుల శ్రీమన్నారాయణ, విజయశ్రీరజాలీ, నాయకులు కుమార్‌యాదవ్, రాంప్రసాద్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆ స్కూల్‌ను అడ్డుకోవడం సరికాదు



వీసీ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ భూమిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటును తాము స్వాగతిస్తున్నామని, ఆ స్కూల్‌ను కొన్ని విద్యార్థి సంఘాల నాయకులు అడ్డుకోవాలని చూడడం సరికాదని కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ బాధ్యులు అన్నారు. ఈ మేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేయబోతుంటే అడ్డుకుంటే ఊరుకునేది లేదని వారు హెచ్చరించారు.

మైనార్టీ గురుకులంలో తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న గౌస్ హైదర్

కాజీపేట / కాజీపేట అర్బన్: కాజీపేట కడిపికొండ గ్రామంలోని తెలంగాణ మైనార్టీల బాలుర గురుకుల ఆశ్రమ పాఠశాలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి గౌస్ హైదర్ గురువారం తనిఖీ చేశారు. తరగతి గదులతో పాటు స్టోర్ రూమ్, వంటశాల, డైనింగ్ హాల్‌ను పరిశీలించి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాల పనితీరు, రికార్డుల నిర్వహణపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. అనంతరం సిబ్బంది, విద్యార్థులతో కలిసి ఆయన సహపంక్తి భోజనం చేశారు.

అప్పులే పుట్టనప్పుడు అభివృద్ధి ఎక్కడిది?



మాట్లాడుతున్న కార్పొరేటర్ చెన్నం మధు

● సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు

హన్మకొండ: అప్పులే పుడతలేవని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుతుంటే ఏ నిధులతో నగరాన్ని అభివృద్ధి చేశారని బీఆర్ఎస్ కార్పొరేటర్లు చెన్నం మధుసూదన్, ఇమ్మడి లోహిత, సుంకు నర్సింగ్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు ప్రశ్నించారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అప్పటి సీఎం కేసీఆర్, అప్పటి మంత్రి కేటీఆర్ సహాయంతో అప్పటి ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశారని వివరించారు. వలస పక్షులతో జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి వారు సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సోదా కిరణ్, బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

కేయూ భూములను కాపాడాలి



సంతకాలు సేకరిస్తున్న సంఘాల బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, యూనివర్సిటీ భూమిని ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేటాయిస్తూ పాలకమండలి ఆమోదం తెలిపిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు కేయూ గేట్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో భారత్ బచావో రాష్ట్ర నాయకుడు, రిటైర్డ్ ప్రొఫెసర్ వెంగల్‌రెడ్డి, ఓంబ్రహ్మ, పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రవణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, స్వేరో స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, బీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు శివకుమార్, బీఆర్ఎస్‌వీ యూనివర్సిటీ నాయకుడు వస్తం అనిల్, డీఎస్‌ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్ష, కార్యదర్శులు సాయి, జశ్వంత్ పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



గురుపౌర్ణమి వేడుకలో అధ్యాపకులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ విభాగం ప్రొఫెసర్ స్వర్ణలత అన్నారు. కేయూలో సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగంలో గురు పూర్ణిమ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వాసు, సాహితి, సుభాష్, రజిత, ప్రసన్న, యాస్మిన్, పరిశోధక విద్యార్థులు డి.తిరుపతి, రాజారాం, కందికొండ తిరుపతి, రాజు, శ్రీదేవి, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఆరె కటికల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

రామన్నపేట: ఆరె కటిక కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తానని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. 11వ డివిజన్ అలంకార్ జంక్షన్‌లో ఆరె కటిక గురువు ధర్మవ్యాధుడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి ఎంపీ కావ్య గురువారం ముఖ్యఅతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐకమత్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ మిరియాల్‌కార్ దేవేందర్, సురేందర్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తం



విద్యారణ్యపురి: మానవ అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏహెచ్‌టీయూ వరంగల్ పోలీస్ కమిషనరేట్ మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఇన్‌స్పెక్టర్ శ్యామ్ సుందర్ సూచించారు. మానవ అక్రమ రవాణా, బాలల సంక్షేమంపై యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ) వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్‌లో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది నుంచి 18 ఏళ్ల వయస్సు చాలా కీలకమన్నారు. ఈ దశలోనే ప్రలోభాలకు గురై ఇతరుల చేతిలో మోసపోయే అవకాశం ఉంటుందని అన్నారు. పిల్లలతో భిక్షాటన చేయించడం, మాదక ద్రవ్యాల సరఫరాకు వినియోగించుకోవడం, బాలకార్మికులుగా మార్చడం, యుక్త వయస్సులో అడుగిడిన వారిని అనైతిక కారకలాపాల్లోకి దింపడం, బాల్య వివాహాల వంటివి తమ దృష్టికొస్తే 1098, 100, 1930 టోల్‌ఫ్రీ నంబర్లకు ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏహెచ్‌టీయూ సబ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ భాగ్యలక్ష్మి, పాఠశాల హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలి

ఖిలా వరంగల్: బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా కార్యదర్శి చింతకింది కుమారస్వామి డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి కేంద్రానికి గవర్నర్ ద్వారా పంపించినప్పటికీ మోదీ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని అన్నారు. శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో మోటం కుమారస్వామి అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓర్సు రాజుతో కలిసి కుమారస్వామి మాట్లాడారు. అసంఘటిత కార్మికులుగా పనిచేస్తున్న బీసీలను అణగదొక్కడానికి, వారి శ్రమను దోపిడీ చేయడానికి మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. బీసీ కార్మికుల హక్కుల పరిరక్షణకు ఈ నెల 15న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట జరగనున్న ధర్నాలో బీసీలు అధికసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నాయకులు కుమార్, పద్మ, రజని, దివ్య, రమేష్, ప్రభాకర్ పాల్గొన్నారు

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

హన్మకొండ: ఎన్నికల ముందు దివ్యాంగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ వినోద్ రెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండ సుబేదారిలోని వికలాంగుల హాస్టల్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వికలాంగులకు నెలకు రూ.6 వేలు, ఇతరులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి రాగానే మాట తప్పారని విమర్శించారు. సామాజిక పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న హనుమకొండలో జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు వెంకటస్వామి మాదిగ, రాజారపు భిక్షపతి మాదిగ, శ్రీనివాస్ గౌడ్, సుంచు రజిని కుమార్ మాదిగ, బొట్ల రాజు, సురేష్, బొక్క రాజేష్ మాదిగ, రేణుకుంట్ల రాజేంద్ర మాదిగ, అద్దూరి అనిల్ మాదిగ పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం బలోపేతానికి కృషి చేస్తా

నయీంనగర్: వరంగల్ జిల్లా మున్నూరుకాపు సంఘం బలోపేతానికి కృషి చేస్తానని వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన 33వ డివిజన్ కార్పొరేటర్ ముస్కమల్ల సుధాకర్ పటేల్ అన్నారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లాలోని అన్ని మండలాల్లో మున్నూరుకాపు సంఘం ఎన్నికలు నిర్వహించి అందరిని ఏకతాటిపైకి తీసుకొస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాల నవీన్‌రాజు, సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, బండి రమేష్, కంచి మనోహర్, భాస్కర్, తోట తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వైద్య శిబిరం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఆస్పత్రిలో రైల్వే ఆస్పత్రి, అంజలి కిడ్నీ కేర్ రీసెర్చ్ సెంటర్ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన ఉచిత యూరాలజీ వైద్య క్యాంపు గురువారం ముగిసింది. రెండు రోజులు పాటు జరిగిన శిబిరంలో వైద్యులు పాల్గొని పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ప్రోస్టేజ్, కిడ్నీ, స్టోన్స్ సమస్యలతో బాధపడుతున్న 80 మందిని గుర్తించినట్లు తెలిపారు. శిబిరంలో రైల్వే డాక్టర్లు ఐ.నిరంజన్ రావు, నరేందర్, వినయ్‌బాబు, హరిబాబు, యాకూబ్, అంజలి కిడ్నీకేర్ వైద్యులు గీతాంజలి, నరేష్, విద్రా, లాలస, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు రాజేష్, సురేష్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

హసన్‌పర్తి: బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలంలోని సిద్ధాపురం, బైరాన్‌పల్లి, హరిశ్చంద్రనాయక్ తండా, కొత్తపల్లి గ్రామాల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని ఆరోపించారు. కార్పొరేటర్లు దివ్యరాణి, రవినాయక్, ఆత్మ మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, రైతుబంధు సమితి జిల్లా కార్యవర్గ మాజీ సభ్యుడు విక్టర్ బాబు, మాజీ సర్పంచ్‌లు సాంబారెడ్డి, ఈశ్వరమ్మ, బీఆర్ఎస్‌వీ కేయూ ఇన్‌చార్జ్ జట్టి రాజేందర్, మాజీ ఎంపీటీసీ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో హరితహారం

కాజీపేట: 63వ డివిజన్ బాపూజీనగర్ వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ ఆవరణలో మార్కెట్ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం పలు మొక్కలు నాటారు. సంఘం గౌరవ అధ్యక్షుడు నార్లగిరి రామలింగం ఆధ్వర్యంలో సభ్యులు రెండేసి చొప్పున మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు స్వీకరించారు. మొక్కలను సురేష్ దంపతులు మార్కెట్ కమిటీకి ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ అధ్యక్షుడు నిషాని భిక్షపతి, నాగరాజు, కుమార్, కొట్టె విలేకరి, కొమురమ్మ, రాజేశ్వరి, స్వరూప, రామక్క, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ఖిలా వరంగల్: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట క్రాస్ రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఆర్చిని ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం జరిగింది. క్షతగాత్రుడిని అంబులెన్స్ వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి మామునూరు పోలీసులు చేరుకొని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

బాలుడి చేరదీత

ఖిలా వరంగల్: రైలులో తప్పిపోయిన బాలుడిని వరంగల్ రైల్వే పోలీసులు చైల్డ్ హోమ్‌కు తరలించారు. సికింద్రాబాద్ ఎస్‌బీ కంట్రోల్ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేరళ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం ప్రయాణిస్తున్న బాలుడిని రైల్వే పోలీసులు చేరదీశారు.